సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 6 । జూలై । 2025



నేడు నష్టాల్లో..

మహిళా మార్ట్‌లు నష్టాల బాట పట్టాయి. నరసన్నపేటలో మార్ట్ తెరుచుకోవడం లేదు.

- 8లో



కల్తీ సిగరెట్ల కలకలం

టెక్కలిలో కల్తీ సిగరెట్లు కలకలం రేపాయి. విపరీతంగా విక్రయాలు జరుగుతున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

6, 7, 8, 9వ తరగతి సీట్లు భర్తీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–2026 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9వ తరగతిలో మిగిలి ఉన్న సీట్ల అడ్మిషన్‌కు కౌన్సిలింగ్‌ను ఈనెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్టు గురుకులాల జిల్లా సమన్వయకర్త గుంపుల గ్రేస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని గత నెల 25న పరీక్షకు హాజరైన విద్యార్థులు ఈ నెల 7న జరగనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. ఈ కౌన్సెలింగ్ పెద్దపాడులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాలేజీలో ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు బాలికలకు, అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు బాలురుకు ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 97017 36862, 9000314209 నంబర్లకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

ఎడమ కాలువకు గండి




హిరమండలం వంశధార ఎడమ కాలువకు పడిన గండిని పరిశీలిస్తున్న అధికారులు

హిరమండలం: వంశధార గొట్టా బ్యారేజీ నుంచి ఎడమ ప్రధాన కాలువలోకి ఈ నెల 2న సాగునీరు విడుదల చేశారు. కాలువలోకి తొలుత 500 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టి క్రమేపీ 650 క్యూసెక్కులకు పెంచారు. అయితే శనివారం మజ్జిగూడెం పరిధిలో 5.71 కిలోమీటర్ వద్ద గట్టుకు గండి పడింది. దీంతో గట్టుకు దిగువన ఉన్న పొలాల్లోకి నీరు చేరటంతో రైతులు గమనించి గొట్టా బ్యారేజీ కంట్రోల్ కార్యాలయ అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో ఈఈ సీతారాంనాయుడు, స్థానిక ఇంజినీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎడమ కాలువకు విడిచిపెట్టిన ప్రవాహాన్ని నిలుపదల చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులు అంబావల్లి నీటిసంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గండిని పూడ్చారు. గట్టుకు ఎలుకలు రంధ్రం చేయడం వల్ల గండి ఏర్పడినట్లు అధికారులు తెలిపారు.

కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా లక్ష సంతకాల సేకరణ

వజ్రపుకొత్తూరు: కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా లక్ష సంతకాల సేకరణ ఉద్యమం ప్రారంభమైంది. శనివారం మండలంలోని ఒంకులూరు గ్రామంలో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి వేదిక అధ్యక్షుడు అజ శర్మ, పలువురు ప్రజాస్వామికవాదులు మాట్లాడారు. ఎనిమిది నెలలుగా స్థానికులు తమ భూమి కోసం పోరాడుతుంటే పాలకులు స్పందించక పోవడం దారుణమన్నారు. 1400 ఎకరాల్లో ప్రభుత్వం భూసేకరణ చేపట్టి వృక్షాలను తొలగిస్తే పర్యావరణ సమతుల్యత, తీర ప్రాంత రక్షణ దెబ్బతింటుందని అన్నారు. మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో 45 గ్రామాల్లోని జీడి, కొబ్బరి సారవంతమైన నేలలు కార్పొరేట్లకు ధారాదత్తం చేసేందుకు కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జోగి అప్పారావు, పొట్టి ధర్మారావు, చీకటి ధనుంజయ, సీపీఐఎంఎల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శోక వారధులు



ఆమదాలవలస మండలం తోటాడ, గోపీనగరం గ్రామాల సమీపంలో నిర్మించిన వంతెనలు

- వంతెనల సమీపంలోని భారీగా అక్రమ ఇసుక తవ్వకాలు
- నాగావళి గట్లు కోతకు గురయ్యే ప్రమాదం
- కనుమరుగవుతున్న కరకట్టలు

ఆమదాలవలస రూరల్:

అక్రమ ఇసుక తవ్వకాలతో ఆమదాలవలస శోకం పెడుతోంది. ఆమదాలవలస మండలం తోటాడ జాతీయ రహదారి మొదలు బూర్జ మండలం లాభాం వంతెన వరకు సుమారు 30 కిలోమీటర్ల పొడవున నాగావళిని తవ్వి నాశనం చేస్తున్నారు. వంతెనలు సైతం లెక్క చేయకుండా ఇసుక దందా చేస్తున్నారు. నేరుగా నదిలోనే యంత్రాలు పెట్టి దోచుకుంటున్నారు.

అంతా నిబంధనలకు విరుద్ధమే..



నాగావళిలో యంత్రాల సాయంతో ఇసుక తోడుతున్న దృశ్యం

నిబంధలకు విరుద్ధంగా ఇసుక మాఫియా ఇక్కడ రెచ్చిపోతున్నా అధికారులు కిమ్మనడం లేదు. నిబంధనల మేరకు వంతెనలకు మూడు కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి ఇసుక తవ్వకాలు చేయకూడదు. నదిలో ఇసుక మేటలు బట్టి మీటర్ నుంచి రెండు మీటర్లకు మించి తవ్వకూడదనేది కూడా ఆ శాఖ నిబంధనే. కానీ ఇసుక మాఫియాకు మాత్రం ఇవేమీ పట్టడం లేదు. నదిలో మూడు మీటర్లకు మించి ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు అడ్డుకోవటంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది.

భయం గుప్పెట్లో నదీతీర గ్రామ ప్రజలు



ఆమదాలవలస మండలం కలివరం వద్ద గతంలో కోతకు గురై రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలు కూలిపోయిన దృశ్యం

గతంలో ఆమదాలవలస మండలం కలివరం, తొగరాం, ఇసుకలపేట, కొత్తవలస, ముద్దాడపేట,దూసి, తోటాడ తదితర గ్రామాల కోతకు గురైన సంఘటనలు ఉన్నాయి. అక్రమ ఇసుక తవ్వకాల వల్ల వరదల వేళ అనేక గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం కూడా ఉంది. గత టీడీపీ పాలనలో ఇదే తరహాలో ఇసుక తవ్వకాలు చేయటం వల్ల కలివరం గ్రామం కోతకు గురై రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలు పూర్తిగా కూలిపోయాయి. కలివరం, ముద్దాడపేట గ్రామాల నడుమ అనేక ఎకరాలు జీడి, మామిడి తోటలు నదిలో కలిసిపోయాయి.



బూర్జ మండలం నారాయణపురం వద్ద ఆనకట్టు కొట్టుకుపోతున్న దృశ్యం

ముంచుకువస్తున్న ముప్పు

నిబంధనలకు విరుద్ధంగా వంతెనల సమీపంలో ఇసుక తవ్వకాలు చేయటం వల్ల వంతెనలకు ముప్పు సంభవించే ప్రమాదం కనిపిస్తోంది. నాగావళి నదిపై ఆమదాలవలస మండలం తోటాడ వద్ద జాతీయ రహదారిపై రెండు వంతెనలు ఉండగా వంతెనలకు ఆనుకొని ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. అంతేకాకుండా ఇదే మండలంలో దూసి వద్ద రైల్వే వంతెన ఉండగా వంతెన సమీపంలోనే ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అంతేకాకుండా బూర్జ మండలం నారాయణ పురం వద్ద ఆనకట్టు ఉండగా ఇదే మండలంలో లాభాం వద్ద మరో వంతెన ఉంది. ఈ రెండుచోట్ల కూడా భారీ ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి.

కరకట్టలకు ప్రమాదం..



ఆమదాలవలస మండలం తొగరాం వద్ద కోతకు గురవుతున్న కరకట్ట



లాభాం, గుత్తావిల్లి గ్రామాల వద్ద కోతకు గురవుతున్న నాగావళి గట్టు

నాగావళి నది పొడవునా భారీ అక్రమ ఇసుక తవ్వకాలు జరగటంతో కరకట్టలకు ప్రమాదం పొంచి ఉంది. గతంలో అనేక గ్రామాలు గతంలో కోతకు గురికావటంతో ఇసకలపేట, తొగరాం, కలివరం, ముద్దాడపేట, కొత్తవలస, పీరుసాహెబ్‌వానిపేట తదితర గ్రామాల వద్ద కరకట్టలు నిర్మించారు. అయితే ఈ భారీ ఇసుక తవ్వకాల వల్ల ముప్పు పొంచి ఉంది.

కాయ్ రాజా కాయ్

తిలారులో పిక్కాట ఆడుతున్న దృశ్యం



- తిలారులో జోరుగా ఆరుపిక్కలాట
- నరసన్నపేట, జలుమూరు, కోటబొమ్మాళి, టెక్కలి నుంచి జూదగాళ్లు

జలుమూరు: కోటబొమ్మాళి మండలం తిలారు గ్రామం, జంక్షన్‌ల మధ్య ఆరుపిక్కలాట జోరుగా సాగుతోంది. ప్రస్తుతం జగన్నాథుని రథోత్సవాలు జరుగుతుండడంతో శనివారం దేవుడి కోసం పెట్టిన విద్యుత్ దీపాల కిందే ఈ దందా సాగింది. అటు నరసన్నపేట, జలుమూరు మండలాల పోలీసులతో పాటు కోటబొమ్మాళి మండల పోలీసులకు దీనిపై పక్కా సమాచారం ఉన్నా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇందులో నారాయణవలస సంత నిర్వాహకుల భాగస్వామ్యం ఉందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వీటి నిర్వహణ అంతా టెక్కలి, కోటబొమ్మాళి, జలుమూరు మండలాల నాయకులు చూస్తున్నారన్నది బహిరంగ సత్యం. కొందరు అధికారులు కూడా సహకరిస్తున్నారనే సమాచారం ఉంది. జిల్లాలో లాటరీ నిర్వహణపై నిషేధం ఉన్నా రథయాత్ర ఉత్సవాలు జరిగిన పది రోజులూ ఆరు పిక్కలాట సాగింది. నిర్వాహకుల్లో కొందరికి వాటాలు కుదరకపోవడంతో వారు పోలీసులతో పాటు సోషల్ మీడియాలో ఫొటోలు షేర్ చేసినట్లు భోగట్టా. కోటబొమ్మాళికి చెందిన ఓ కీలక నేత ఆదేశాలు ఉండడంతో పోలీసులు దాడులు చేయడం లేదని తెలుస్తోంది. జలుమూరు, నరసన్నపేట, కోటబొమ్మాళి, టెక్కలి నుంచి వాహనాల్లో వచ్చి ఈ ఆటలు నిర్వహించారని స్థానికులు చెబుతున్నారు.

2780 కేసులు రాజీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్‌లో 2780 కేసులు జిల్లా మొత్తం మీద రాజీ అయ్యాయి. వీటిలో సివిల్ కేసులు 150, క్రిమినల్ కేసులు 2582 పరిష్కరించారు. ప్రీ లిటిగేషన్ కేసులు 48 రాజీ చేశారు. భార్యభర్తలను రాజీ చేసి కలిపారు. దీనిపై న్యాయమూర్తులు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులకు ఆహారం, నీరు సదుపాయాన్ని జి.ఇందిరా ప్రసాద్, గేదెల వాసుదేవరావు అందజేశారు.

'బ్యాంకు ఖాతాను ప్రారంభించండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇంటర్ ఫస్టియర్‌లో చేరిన షెడ్యూల్ కులాల విద్యార్థులు తల్లికి వందనం పథకం కోసం బ్యాంకులో గానీ పోస్టాఫీసులో గానీ వ్యక్తిగత ఖాతా తెరవాలని, ఈ ఖాతాకు ఆధార్ కార్డుతో ఎన్‌పీసీఐకు లింకు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ డి.మధుసూదరావు తెలిపారు. ఈ నగదు నేరుగా విద్యార్థుల వ్యక్తిగత ఖాతాలకు జమవుతాయని, ఎన్‌పీసీఐ తప్పనిసరని తెలిపారు.



టీకా.. మర్చిపోరుగా..

- నేడు జూనోసిస్ డే
- పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి

శ్రీకాకుళం కల్చరల్:

పొద్దంతా కష్టపడి ఇంటికి వచ్చే ఓ వ్యాపారికి ఓ బుజ్జి కుక్కపిల్లతో సాంగత్యం హాయినిస్తుంది. పొలంలో చెమట్లు చిందించి సందె వేళకు ఇంటి పంచకు చేరే రైతన్నకు ఆవుకు మేత పెడుతూ గంగడోలు నిమరడం ఓ థెరపీలా పనిచేస్తుంది. పొలంలో మంద పని అయిపోగానే బుజ్జి మేకపిల్లను భుజానికెత్తుకుని ఇంటికి నడవడం కాపరికి ఓ సాంత్వన. కాలేజీ నుంచి నేరుగా ఇంటికి వచ్చిన విద్యార్థికి 'హాయ్..' అంటూ ఓ చిలుక ముద్దుగా పలకరిస్తే కష్టం కరిగిపోతుంది. పెంపుడు జంతువులతో సాన్నిహిత్యం మనసుకు ఊరట కలిగిస్తుంది. అంతకంటే ముఖ్యంగా ఆ జంతువుకు టీకా వేయించడం ప్రాణాలకు రక్షణగా ఉంటుంది. నేడు వరల్డ్ జూనోసిస్ డే. పెంపుడు జంతువులపై ప్రేమకు ప్రతిరూపంగా మెడలో చైన్లు, వాటిని కొత్త కొత్త డ్రెస్‌లు కొనడం చాలా మంది చేస్తుంటారు. కానీ చేయాల్సిన అసలైన పనివాటికి సరైన సమయానికి టీకాలు వేయించడం. ఏడాదికో మారు టీకా వేయిస్తే చాలు ఎంచక్కా సాంగత్యాన్ని ఎంజాయ్ చేయవచ్చు.



కుక్కకు చికిత్స చేస్తున్న వైద్యుడు

జాగ్రత్తగా పెంచుకోవాలి



పెంపుడు జంతువుల విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలి. మంచాల మీదకు ఎక్కించుకోవడం, ముద్దులాడడం వంటివి చేయకూడదు. ఎందుకంటే వాటి వల్ల మనకు తెలియని జబ్బులు వస్తాయి. సమయానికి వ్యాక్సిన్లు వేయించడం అత్యవసరం.

– డాక్టర్ ఆర్.హేమంత్‌కుమార్,
డాక్టర్ డాగ్ యానిమల్ ఆస్పత్రి, శ్రీకాకుళం

నాకు కుక్కలంటే చాలా ఇష్టం



నాకు కుక్కలంటే ఇష్టం. నావద్ద 16 కుక్కలు ఉన్నాయి. వీటిని నేను కొనలేదు. కొందరు పెంచలేక వదిలేసిన వాటిని చేరదీస్తున్నాను. వాటికి ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లు వేయిస్తుంటాను.

– సతీష్, జంతుప్రేమికులు, శ్రీకాకుళం

10న మెగా టీచర్ పేరెంట్ మీటింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మెగా టీచర్, పేరెంట్ మీటింగ్‌ను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ, జూనియర్ కళాశాలల్లో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఈ నెల 10న మెగా టీచర్ పేరెంట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో శనివారం మెగా టీచర్ పేరెంట్ మీటింగ్‌పై సంబంధిత అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, విజన్ డెవలప్‌మెంట్ అధికారులు, ఈఆర్వోలు మెగా టీచర్ పేరెంట్ మీటింగ్ ఏర్పాట్లలో సహకరించాలని తెలిపారు. ఆ రోజు నాటికి విద్యార్థులందరికీ యూనిఫారాలు, కిట్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు వేగవంతం చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను ఆహ్వానించాలని ఆదేశించారు. తల్లికి వందనంపై ఆయన అడిగి వివరాలు తెలుసుకున్నారు. మండల, జిల్లా స్థాయి షైనింగ్ స్టార్స్ పాఠశాలలో ఉంటే వారితో మాట్లాడించాలని తెలిపారు.

వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవడమే పీ–4 లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంగా పీ–4 కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పీ–4 ఫౌండేషన్ సమీక్ష సమావేశం శనివారం జిల్లా కేంద్రంలో ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీ–4 కార్యక్రమం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ధనవంతులు, శ్రేయోభిలాషులను చేరదీసి వెనుకబడిన కుటుంబాలకు ఆర్థిక సాయం ఉద్యోగావకాశాలు కల్పించడ మే లక్ష్యమని వివరించారు. తాతాల్కిక దాతృత్వాన్ని కాకుండా దీర్ఘకాలిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. నాన్ రెసిడెన్షియల్ ఇండియన్స్‌తో పాటు నాన్ రెసిడెన్షియల్ విలేజర్స్‌ను గుర్తించి వారి ద్వారా కూడా సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో 75,566 కుటుంబాల్లోని 2,11,586 మందిని గుర్తించామన్నారు.

గంటల వ్యవధిలో రూ. 1.25 లక్షల సేకరణ

- గాయపడిన విద్యార్థికి ప్రాణదానం చేసిన దాతలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చరణ్

నరసన్నపేట: స్థానిక ఇందిరా నగర్‌కు చెందిన కె.శ్యామ్‌చరణ్ అనే విద్యార్థి స్కూల్‌లో చేరి ఆరు రోజులే అయ్యింది. స్కూలుకు వెళ్తుండగా ఆటో బోల్తా పడి పిల్లాడికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తే వెంటనే రూ.1.50లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. విద్యార్థి తండ్రి విదేశాలకు వలస వెళ్లడంతో అప్పటికప్పుడు అంత డబ్బు ఎలా తీసుకురావాలో తెలీక తల్లి తల్లడిల్లిపోయింది. ఆరోగ్యశ్రీ కూడా లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోలేదు. కానీ దాతలు స్పందించారు. వాట్సాప్ ద్వారా సమాచారం పంపుకుని గంటల వ్యవధిలో విరాళాలు పోగు చేసి రూ.1.25 లక్షలు సమకూర్చారు. ఆ డబ్బుతో ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. సమాజంలో మానవత్వం మిగిలే ఉందని నిరూపించారు. దాతలకు విద్యార్థి తల్లి మీనా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.

యాత్ర సమస్తం నేత్రపర్వం..

జగన్నాథుని మారు రథయాత్ర నేత్రపర్వంగా జరిగింది. గుండిచా ఆతిథ్యం ముగిశాక జగన్నాథుడు సొంత గూటికి పయనమయ్యారు. భక్తజనం జయజయధ్వానాల నడుమ జగన్నాథ, బలభద్ర, సుభద్రలు రథాలపై గర్భగుడికి యాత్ర సాగించారు.

– శ్రీకాకుళం కల్చరల్





శ్రీకాకుళం: ఇల్లీసుపురంలో తిరుగు ప్రయాణంలో జగన్నాథుని రథం



టెక్కలిలో మారు రథయాత్ర



శ్రీకాకుళం మొండేటి వీధిలో 56 రకాల నైవేద్యాల సమర్పణ

క్లుప్తంగా

విద్యుత్ చార్జీలను తగ్గించాలి



ఎస్ఈ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న సీపీఎం శ్రేణులు

అరసవల్లి: రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై చార్జీల పేరుతో మోపుతున్న భారాన్ని వెంటనే తగ్గించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయం వద్ద అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బొత్స సంతోష్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ధరలను పెంచబోమని మాటిచ్చి ఇప్పుడు దఫదఫాలుగా పెంచుతూ పోతోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఈపీడీసీఎల్ డైరెక్టర్



సూర్యప్రకాష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న చక్రవర్తి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ టి.వి.సూర్యప్రకాష్ శనివారం దర్శించుకున్నారు. జిల్లా సర్కిల్ విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తితో పాటు ఆలయ అధికారులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అర్చకులు మాధవ్‌శర్మ, ఆలయ అధికార సిబ్బంది బిఎస్.చక్రవర్తి తదితరులు ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు, డిప్యూటీ ఈఈ చల్లా వెంకటేశ్వరరావు, డీ–1 ఏఈ సురేష్‌కుమార్, జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ అధ్యక్షుడు ఉంగటి పాపారావు పాల్గొన్నారు.

విశ్రాంత ట్రెజరీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా తవిటన్న

శ్రీకాకుళం పాతబస్టాండ్: పదవీ విరమణ పొందిన ట్రెజరీ ఉద్యోగులు శనివారం సంఘం ఏర్పాటు చేసుకున్నారు. ఉద్యోగ విరమణ చేసిన తరువాత వచ్చే ఇబ్బందులు, సంక్షేమాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టేందుకు టీఆర్ఈడబ్ల్యూఏ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ట్రెజరీ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా అంకడాల తవిటన్న, ఉపాధ్యక్షుడిగా భీష్మాచార్యులు, కార్యదర్శిగా రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఎ.కోటేశ్వరరావు, కోశాధికారిగా ఆర్ఎస్ పట్నాయక్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ ట్రెజరీ ఆఫీసర్ రామచంద్రయ్య, డిప్యూటీ ట్రెజరీ ఆఫీసర్ వెంకటరావు పాల్గొన్నారు.

నేడు జిల్లా అండర్-15 చెస్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్–15 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు ఆదివారం జరగనున్నాయని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్, కార్యదర్శి జామి రమేష్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని నానుబాలవీధిలోని చెస్ శిక్షణా కేంద్రంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన వారిని త్వరలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో ఎంపికల్లో పాల్గొనాలని, పూర్తి వివరాలకు 99125 59735 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఏపీచెస్.ఓఆర్జీ వెబ్‌పోర్టల్‌లో వివరాలను నమోదుచేసుకోవచ్చని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బొడ్డేపల్లి రమేష్‌కుమార్



ఆమదాలవలస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఆమదాలవలస పట్టణానికి చెందిన బొడ్డేపల్లి రమేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అధిష్టానం శనివారం ప్రకటన విడుదల చేసింది. ఈయన 2013 నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా పార్టీ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు రమేష్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

ఆప్కో వస్త్రాలపై రాయితీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆప్కో షోరూంలలో ఆషాఢ మాసం సందర్భంగా అన్ని రకాల చేనేత వస్త్రాలపై 30 శాతం, ఎంపిక చేసిన వస్త్రాలపై 50 నుంచి 70 శాతం ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు డివిజనల్ మార్కెటింగ్ అధికారి అనుపమదాస్ శనివారం తెలిపారు. ధర్మవరం, మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ, బందరు, రాజమండ్రి, మంగళగిరి చీరలు, బెడ్‌షీట్స్, లుంగీలు, టవల్స్ అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆప్కో హేండ్‌లూమ్స్.కామ్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఆన్‌లైన్ స్టోర్స్‌లోనూ ఆప్కో వస్త్రాలు లభిస్తాయని తెలిపారు. వస్త్రాలు కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని కోరారు.

- నరసన్నపేటలో తెరుచుకోని మహిళా మార్టు
- కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తగ్గిన వ్యాపారం
- ఆందోళనలో మహిళా సంఘాల సభ్యులు

నాడు రూ.లక్షల్లో.. నేడు నష్టాల్లో!



కొనుగోలుదారులతో మార్ట్ కౌంటర్(ఫైల్)



నరసన్నపేటలో మూతపడిన మహిళా మార్టు

నరసన్నపేట :

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చి దిద్ది వారి కుటుంబాలను ఆర్థికాభివృద్ధి వైపు పయనింపజేసేందుకు వైఎస్సార్ సీపీ పాలనలో ఏర్పాటైన మహిళా మార్టులు కూటమి ప్రభుత్వం వచ్చాక కుదేలయ్యాయి. జిల్లాలోనే అత్యధిక వ్యాపారం చేసిన నరసన్నపేటలోని మహిళా మార్టు ప్రస్తుతం మూతపడింది. గత 15 రోజులుగా షాపు తెరవడం లేదు. 2022 డిసెంబర్ 14న సెర్ప్, డీఆర్‌డీఏ అధికారులు ప్రతిష్టాత్మకంగా ఇక్కడ మార్టును ప్రారంభించారు. మంచి వ్యాపారం చేపట్టి రాష్ట్రంలోనే నరసన్నపేట మార్టు ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇప్పటి వరకూ రూ.5 కోట్లు పైగా టర్నోవర్ సాధించింది. పది మంది వరకూ మహిళలు ఇందులో పనిచేసేవారు.

కూటమి వచ్చాక తిరోగమనం..

నిత్యం లక్షలాది రూపాయల వ్యాపారం చేస్తూ ఆదర్శంగా ఉన్న నరసన్నపేట మహిళా మార్ట్‌ను కూటమి ప్రభుత్వం వచ్చాక నీరుగార్చారు. డీఆర్‌డీఏ అధికారులు కూడా దీనిపై దృష్టి తగ్గించారు. దీంతో ఏడాది కాలంలో మార్టు తిరోగమనంలో నడిచింది. గతంలో రోజూ రూ.40 వేల నుంచి లక్ష రూపాయలు పైబడి వ్యాపారం జరిగేది. దీంతో పాటు మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారయ్యే ఉత్పత్తుల విక్రయాలు కూడా ఇక్కడ జరిగేవి. తద్వారా ప్రజలకు నాణ్యమైన సరుకులు తక్కువ ధరలకే అందేవి. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్టు కావడంతో ప్రజల నుంచి కూడా మంచి ఆదరణ లభించింది. ఇలాంటి మార్టును మూసేయడం పట్ల స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది.

షేర్ ధనం ఎక్కడ?

నరసన్నపేట మండలంలో 1998 మహిళా సంఘాలు ఉండగా దీంట్లో 24,512 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 22,500 మంది నుంచి మహిళా మార్టు కోసం రూ.110 చొప్పున వసూలు చేశారు. వీరందరికీ షేర్ ధనం రూపంలో భాగసామ్యం కల్పించారు. ప్రస్తుతం ఈ షేర్ ధనం కూడా మాయం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ డబ్బు ఏమైందని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. తమ వద్ద వసూలు చేసిన షేర్ ధనం మొత్తం తిరిగి చెల్లించాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

లాభాల్లోనే అప్పగించాం..

బాగా వ్యాపారం చేశాం. ప్రభుత్వం మారేటప్పటికి లాభాల్లోనే ఉండేది. స్వయం శక్తి సంఘాలకు ఇచ్చేందుకు రూ.3 లక్షలు పక్కన పెట్టాం. సరుకులు కూడా అధికంగా ఉండేవి. దీనిని కొనసాగించాలి.

– చింతు శ్రీదేవి, మాజీ ఎంఎంఎస్ అధ్యక్షురాలు, నరసన్నపేట

పునఃప్రారంభిస్తాం..

మహిళా మార్ట్ భవనం కొంత మరమ్మతులు చేపట్టాలి. తర్వాత పునఃప్రారంభించాలని పీడీ అంటున్నారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతానికి సరుకులు ప్యాక్ చేసి ఉంచాం.

– అప్పలరామయ్య, ఏపీఎం, నరసన్నపేట



సారూ.. కనికరించాలి మీరు!



- ఇప్పటికే అధికార పార్టీ ఒత్తిళ్లతో పోలీసులు సతమతం
- తమ బాధలు పట్టించుకోవాలని 'అధికారి'కి విన్నపం

శ్రీకాకుళం క్రైమ్ : అంతుబట్టని 'అధికారి' వ్యూహం పేరిట శుక్రవారం 'సాక్షి' పత్రికలో వచ్చిన కథనం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. జిల్లావ్యాప్తంగా ఇటీవల బదిలీలైన పోలీసుల్లో అన్యాయంగా దూరంగా వెళ్లిపోయి బాధపడినవారంతా తమ గోడు కనీసం పత్రికలోనైనా వచ్చినందుకు సంతోషపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాకుళం జిల్లాలో అంతా తానై వ్యవహరించిన ఆ అధికారి దగ్గరుండి మరీ బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే కూటమి పాలకుల కక్ష, ఒత్తిళ్లతో ఇబ్బందులు పడుతున్నామని, కనీసం తమ విభాగానికి చెందిన ఆ 'అధికారి' అయినా తమ కష్టసుఖాలు అర్థం చేసుకుంటే చాలని వేడుకుంటున్నారు.

కాస్త ఉపశమనం..

రాజకీయ సిఫార్సులు పట్టించుకోలేదని, నిజాయితీగా, పారదర్శకంగా చేశారని, తప్పు చేసిన వారిని శంకరగిరి మాన్యాలు పట్టించారని 'అధికారి'ని ఆకాశానికెత్తినవారు కొందరైతే.. తమకు అన్యాయం జరిగిందని, ఆరోగ్యం, వయసు దృష్టిలో పెట్టుకోకుండా ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నవారిని సైతం దూరంగా బదిలీ చేశారని, పోనీ పనిష్మెంట్ల పేరిట పంపించేశారంటే అదీ కాదని బాధపడినవారూ ఉన్నారు. ముందుగా బదిలీ అయిన 221 మంది ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లలో ఇలా బాధపడినవారు అధికం. అధికారి అర్థం చేసుకున్నారో ఏమో గానీ శుక్రవారం జరిగిన 97 మంది పీసీలు, హెచ్‌సీల తుది విడత బదిలీల్లో సమీపం పోలీస్‌స్టేషన్‌లలోనే వేసి వారికి కాస్త ఉపశమనం కల్పించారు.

మహిళా పోలీసులది మరోబాధ..

తాజాగా బదిలీ అయిన సచివాలయ మహిళా పోలీసులు కూడా తమ గోడును వారి వాట్సాప్ గ్రూపుల్లో పంచుకుంటున్నారు. తమ కుటుంబం, పిల్లలు, ఆరోగ్య సమస్యలనైనా దృష్టిలో పెట్టుకుని పక్కనున్న సచివాలయాల్లో గానీ, ఒకటి రెండు మండలాలు దాటైనా బదిలీ చేసుంటే బాగుండేదని అనుకుంటున్నారు. 50 కిలోమీటర్ల దాటైతే రోడ్లపై ఉరుకుల పరుగులతో స్కూటీలపై వెళ్లి ఎక్కడ ప్రాణాల మీదకు తెచ్చుకునే పరిస్థితి వస్తుందోనని భయపడుతున్నారు. మరికొందరైతే మహిళా పోలీసులు అవసరం లేని చోట బదిలీ కావడంతో వీరిని భవిష్యత్తులో పోలీసు శాఖలోనే ఏదైనా విభాగంలో విధుల్లోకి తీసుకుంటారా.. లేదో తెలియని పరిస్థితి. శుక్రవారం ఇలాంటి వారంతా పోలీసుల గ్రీవెన్సులో మొరపెట్టుకునేందుకు వెళ్లారు. ఆర్డర్లు వచ్చాక చూడొచ్చులే.. రాలేదు కదా.. కొన్నిరోజులు చేశాక తెలుస్తుందిలే.. అంటూ అక్కడి కార్యాలయ సిబ్బంది చెప్పడంతో వెనుదిరిగారు. శనివారం వీరి బదిలీల లిస్టు జిల్లా కలెక్టర్ ఆమోదానికి వెళ్లిందని జిల్లా పోలీసు కార్యాలయ సమాచారం.

'వీఆర్'లకు మోక్షం కలిగేనా?

దాదాపు కూటమి పాలన వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ ముద్రతో పాటు వివిధ కారణాలతో వీఆర్‌లో ఉన్న సీఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీసులు ఎక్కడా పోస్టింగ్ లేక ఇబ్బందులు పడుతున్నారు. రాజకీయ కక్షతో కొందరు కూటమి నాయకులు రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగా ముందుగానే వారి పేర్లున్న లిస్టు పైనున్న ఉన్నతాధికారులకు ఇచ్చేశారని అనుకున్నా.. ఏ రాజకీయ నాయకునికి తలొగ్గరని పేరున్న ఇక్కడ అధికారి కనికరం చూపిస్తే రెగ్యులర్ విధుల్లో తాము చేరడం పెద్ద కష్టమేమీ కాదని వీరు భావిస్తున్నారు. ఆ విధంగానైనా మోక్షం లభిస్తుందో లేదో చూడాలిమరి.

విద్యాశాఖలో అస్తవ్యస్త నిర్ణయాలు

- ఓహెచ్ నిబంధనల్లో మార్పు
- ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయుల మండిపాటు

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ అస్తవ్యస్త విధానాలను అమలుచేస్తోంది. ఆప్షనల్ హాలిడే(ఓహెచ్) నిబంధనలు ఈ ఏడాది మార్చేయడంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. విద్యార్థులకు ఆప్షనల్ హాలిడే వర్తించదని తాజాగా ఉత్తర్వులు జారీ చేయడం వివాదాస్పదమవుతోంది. దీనికితోడు ఉపాధ్యాయులందరికీ కాకుండా 50 శాతం మంది మాత్రమే ఉపయోగించుకోవాలని మరో ఆప్షనల్ హాలిడే రోజున మిగిలిన 50 శాతం మంది ఉపాధ్యాయులు పాఠశాలకు రావక్కర్లేదని ఆ ఉత్తరాల్లో పేర్కొంది. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి, ఓ విద్యా సంవత్సరంలో ఐదు ఐచ్ఛిక సెలవులు ఉంటాయి. వీటిని ఎలా పంచుకోవాలో తెలియక ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. మరోవైపు విద్యార్థులకు సెలవు ఇవ్వకపోవడం తగదని, దీనిపై పునః సమీక్షించుకోవాలని కోరుతున్నారు

ఈసారైనా జరిగేనా?

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాన్ని జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కాగా అదే నెల 20వ తేదీన తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తామని తొలుత ప్రకటించింది. అప్పటికి చాలా పాఠశాలల్లో స్టూడెంట్ కిట్లు పుస్తకాలు అందకపోవడంతో జూలై 5కు వాయిదా వేసింది. అప్పటికి కూడా కొన్ని పాఠశాలలకు పుస్తకాలు చేరకపోవడంతో జూలై 10వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈసారైనా సమావేశం జరుగుతుందో లేదో అన్న అనుమానం వ్యక్తమవుతోంది.

బోధనా సమయాన్ని హరించడం సరికాదు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల్లో ఈ నెల 10న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి నిర్వహిస్తున్న మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం నిర్వహణపై హడావుడి చేయడం వెనుక ఉన్న మర్మమేంటో ప్రభుత్వం తెలియజేయాలని యూటీఎఫ్ జిల్లాశాఖ డిమాండ్ చేసింది. సుమారు పది రోజులపాటు తరగతులకు అవకాశం లేకుండా పీటీఎం సమావేశం ఏర్పాట్లపై అనేక నిబంధనలు, నియమాలు, ఆంక్షలు విధించడం ఉపాధ్యాయుల బోధనా సమయాన్ని హరించడమేనని మండిపడ్డారు. ఈమేరకు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు లండ బాబూరావు, బమ్మిడి శ్రీరామమూర్తి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేరెంట్ టీచర్స్ సమావేశానికి విట్నెస్ అధికారిని పాఠశాల ఉపాధ్యాయులే నియమించుకుని వారిచేత వీడియోలు, ఫోటోలు తీయించి నిర్దేశిత యాప్‌లో అప్‌లోడ్ చేయమని విద్యాశాఖ, సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దుచేయాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థుల ప్రగతి సమీక్ష అక్కర్లేదా?

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఈ నెల 10న నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి విట్నెస్ అధికారిని ఉపాధ్యాయులే నియమించుకోవాలని ఉత్తర్వులు జారీ చేయడం తగదని ఏపీటీఎఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ అధ్యక్షులు బి.రవి, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17 కమిటీల ఏర్పాటు, ఫోటోలు వీడియోలు తీయడానికే ప్రాధాన్యతనిస్తూ.. విద్యార్థి ప్రగతి సమీక్షకు అవకాశం లేకుండా చేస్తున్న ఇటువంటి సమావేశాలు నిరుపయోగం కాదా ? అని ప్రశ్నించారు. ఒకవైపు ఉపాధ్యాయులకు అదనపు పని భారాన్ని పెంచుతూ.. మరోవైపు విద్యాభివృద్ధిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాల నిర్వహణను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రపంచ రికార్డుల కోసం సమావేశమా?

శ్రీకాకుళం న్యూకాలనీ: మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ పేరిట ఉపాధ్యాయులను అవమానపరిచేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు పీఆర్‌టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు తంగి మురళీమోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు పప్పల రాజశేఖరరావు, బత్తుల రవికుమార్ పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రప్రభుత్వం ఈ నెల 10న నిర్వహించే మెగా పేరెంట్స్ డే సమావేశానికి విట్‌నెస్‌గా పాఠశాల విద్యాశాఖ వారు లిప్‌యాప్‌లో నమోదుచేసి, కార్యక్రమాలను వీడియోలు, ఫోటోలను అప్‌లోడ్ చేయమనడం ఉపాధ్యాయులను, ఎంఈఓలను, విద్యాశాఖాధికారులను అవమానపర్చడమేనని పేర్కొన్నారు. పీటీఎం ఫోటోలు/వీడియోలు అప్‌లోడింగ్ చూస్తుంటే.. యోగా డే మాదిరిగా ఇదేదో ప్రపంచ రికార్డుల కోసమో, గిన్నిస్ రికార్డుల కోసమే చేస్తున్న ప్రక్రియలాగే కనిపిస్తుందని మండిపడ్డారు. కింది స్థాయి అధికారులకు, హెచ్‌ఎంలకు పూర్తిస్వేచ్ఛ ఇస్తే కార్యక్రమం విజయవంతం అవుతుంది తప్ప బంధనాలతో కాదన్నారు. కార్యక్రమ వేదికగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని నిలదీస్తే.. వాటికి ప్రభుత్వ పెద్దలు, జిల్లా ప్రజాప్రతినిధులు సమాధానాలు చెప్పగలరా అని సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికీ తల్లికి వందనం చాలా మందికి పడలేదని పాఠశాలలకు వస్తున్నారని గుర్తుచేశారు. 1998, 2008 డీఎస్సీ మినిమం టైమ్ స్కేల్ ఉపాధ్యాయుల విషయంలో నిబంధనలను పక్కనపెట్టి.. విద్యాశాఖ కౌన్సెలింగ్ చేయడం బాధాకరమని పీఆర్‌టీయూ నాయకులు మండిపడ్డారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ధర్నా చేస్తున్న ఈయూ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్:

ఏపీఎస్ ఆర్టీసీలో మూడు వేల మందికి పదోన్నతులు కల్పించాలని, కొత్తగా 10 వేల మందికి నియామకాలు(రిక్రూట్‌మెంట్) చేపట్టాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.నానాజీ, జిల్లా అధ్యక్షుడు జి.త్రినాథరావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలో ఈయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారా నిర్వహించాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని, పాతపద్ధతిలోనే వైద్య సదుపాయాలు కల్పించాలని, ఐఆర్ వెంటనే ప్రకటించాలని, 1/19 సర్క్యులర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వారిని ఆప్కాస్‌లో చేర్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి.బి.రావు, ఎస్.వి.రమణ, కె.బాబూరావు, పి.వి.ఆర్.ఎల్.లలితకుమారి, జి.బి.మూర్తి, బి.రామకృష్ణ, కె.జి.రావు, వై.కె.కుమార్, ఆర్.వి.రావు, ఎ.ఎస్.చలం, బి.సుజాత, పి.ఎస్.కుమార్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు టి.ముత్యాలరావు, కిరణ్, నవీన్, అనిల్ పాల్గొన్నారు.

టెక్కలిలో కల్తీ సిగరెట్ల కలకలం



టెక్కలిలో విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్న కల్తీ సిగరెట్లు

టెక్కలి: సిగరెట్లు తాగడమే ఆరోగ్యానికి హానికరమైతే.. అందులో కల్తీ సిగరెట్లను విచ్చలవిడిగా విక్రయిస్తూ ధూమపానప్రియుల ఆరోగ్యాన్ని మరింత హరింపజేస్తున్నారు. డివిజన్ కేంద్రమైన టెక్కలితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కల్తీ సిగరెట్ల అమ్మకాలు జోరందుకున్నాయి. ఒడిషా ప్రాంతం నుంచి టెక్కలి మీదుగా శ్రీకాకుళం, విశాఖ తదితర ప్రాంతానికి వీటిని తరలిస్తున్నారు. ముఖ్యంగా అధిక ధర కలిగిన కొన్ని రకాల సిగరెట్లను పోలిన విధంగా కల్తీ సిగరెట్ ప్యాకెట్‌లను దిగుమతి చేస్తున్నారు. కొన్ని రకాల ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన వాహనాలు, బస్సుల్లో నేరుగా తరలిస్తూ పట్టణ, గ్రామాల్లోని పాన్‌షాపులకు విక్రయిస్తున్నారు. ఒరిజినల్‌ను పోలిన విధంగా కల్తీ సిగరెట్లు ఉండడంతో, వాస్తవ ధరలకే వాటిని కొనుగోలు చేసుకుని ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఇటీవల టెక్కలిలో కొన్ని రకాల కంపెనీలకు చెందిన ప్రతినిధులు విస్తృతంగా దాడులు చేసి కల్తీ సిగరెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అయినప్పటికీ పట్టణంలో గతంలో అక్రమంగా గుట్కాలను సరఫరా చేసే కొంతమంది వ్యక్తులు ఇష్టారాజ్యంగా కల్తీ సిగరెట్లు సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

పురుగులిలా.. బియ్యం వండేదెలా?



కొత్తూరు: ఎస్సీ బాలుర వసతి గృహానికి అందించిన బియ్యంలో పురుగులు



సారవకోట: బియ్యం చెరగడంతో బయట పడిన తెల్లపురుగులు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి అందిస్తున్న బియ్యంలో పురుగులు కనిపిస్తుండటంతో ఇటు ఉపాధ్యాయులు, అటు నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. పురుగుల బియ్యంతో వండలేక, చిన్నారులకు పస్తులు ఉంచలేక సతమతమవుతున్నారు. కూటమి ప్రభుత్వం సన్నబియ్యం పేరిట పురుగుల బియ్యం పంపిణీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం సారవకోట మండలంలోని సారవకోట, ధర్మలక్ష్మీపురం, మొదలికొత్తూరు, చిన్నకిట్టాలపాడు తదితర పాఠశాలల్లో బియ్యంలో పురుగులు బయటపడ్డారు. కొత్తూరు మండలంతో పాటు జిల్లావ్యాప్తంగా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు సరఫరా చేసే బియ్యం బస్తాల్లో పురుగులు ఉన్నట్లు 'సాక్షి' శనివారం వెలుగులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

– సారవకోట/కొత్తూరు


అందుబాటులోకి సీఎన్‌జీ సేవలు



సీఎన్‌జీ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కంప్రెస్డు నేచర్ గ్యాస్ (సీఎన్‌జీ)ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో నిర్వహిస్తున్న పౌర సరఫరాల సంస్థ పెట్రోల్ బంకులో సీఎన్‌జీ స్టేషన్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎన్‌జీ వల్ల కాలుష్యం తగ్గుతుందన్నారు. కిలో రూ.91కే లభిస్తుందన్నారు. బంకు వద్ద 450 కేజీల నిల్వ ఉంటుందని వివరించారు. టెక్కలి వద్ద సైతం సీఎన్‌జీ ఏర్పాటు చేయాలని ఇండియన్ ఆయిల్ కంపెనీ యాజమాన్యానికి మంత్రి కోరారు. ఇప్పటికే అనుమతులు తీసుకున్నట్లు ఆర్డీఓ కష్ణమూర్తి చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, రీజనల్ హెడ్ డి.సుధాకరరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణరావు నేత్రాలు సజీవం



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో నివాసం ఉంటున్న పడాల నారాయణరావు(84) అనారోగ్యంతో మృతి చెందారు. మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుమారులు పి.శ్రీనివాస్, పి.శ్రీకాంత్, కుమార్తె పి.శ్రీదేవిలు విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. డాక్టర్ కె.సుధీర్ పర్యవేక్షణలో మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి పి.సుజాత, పి.చిన్నికృష్ణల ద్వారా కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి పంపించారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్‌తో పాటు కార్యదర్శి మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు సంప్రదించాలని కోరారు.

అలరించిన గజల్స్ గానలహరి



గజల్ కళాకారుడు వాసుదేవాచారిని సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో 309వ నెలవారి కార్యక్రమం బాపూజీ కళామందిర్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన గజల్ కళాకారుడు వాసుదేవాచారి సినారె గజల్స్‌ను చక్కగా గానం చేశారు. ముందుగా కార్యనిర్వాహక అధ్యక్షులు పన్నాల నర్సింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన సభలో రిటైర్డ్ సెట్‌శ్రీ సీఈవో బి.వి.ప్రసాదరావు, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు లు మాట్లాడుతూ ప్రతినెలా పేద కళాకారులను ప్రోత్సహించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో కళాకారుల సమాఖ్య సభ్యులు బి.రామచంద్రదేవ్, కంచరాన అప్పారావు, అగతమూడి సింహాచలం, ఇంజరాపు రమణారావు, పైడి సత్యవతి, బందారు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.